# ప్యారిస్

బుర్రా వెంకటసుబ్రహ్మణ్యము

ఎవరికైనా నేను బుద్ధిపొరపాటున పాశ్చాత్య దేశాలు కొన్ని చూసి తిరిగివచ్చానని తెలిస్తే వాళ్లు నన్నుముందు అడిగే ప్రశ్న 'ప్యారిస్ చూసేరా? అని. అంతదూరంవెళ్లి ప్యారిస్‌నగరాన్నా చూడకుండా రావడం? ఈ అడిగేవాళ్లల్లో కొందరు ప్యారిస్ చూడక పోయినా దానిగురించి చదివియుండడంవల్ల 'నాతిర్ దామ్ఆలయం చూసేరా?' అనీ, 'లూవ్రే చిత్రశాల చూసేరా?' అనీ, 'వర్సేయ్ రాజభవనం చూసేరా?' అనీ, 'ఈఫెల్ టూర్ చూసేరా?' అనీ అడుగుతూ ఉంటారు. అన్నీచూసేనని సమాధానం చెప్తూఉంటాను. మరికొందరు ఏవిధంగానో ప్యారిస్ నగరంలో జరిగే వెంకితనాలు కొంతవివరంగా తెలుసుకున్నవాళ్లు 'ఫొలీస్ బర్జీర్ నాటకశాలకి ఎప్పుడైనా వెళ్లేరా?' అని సందేహిస్తూ అడుగుతారు. వాళ్ల కుతూహలం గ్రహించి నవ్వుతూ 'వెళ్లేన'ని జవాబిస్తాను. కాని ప్యారిస్ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఇవేవీ నాకు జ్ఞాపకంరావు. అందుకు మొదటికారణం ప్యారిస్‌నగరాన్నీ, ఆనగరం యొక్క దృశ్యాలనీ నేను ఒక్కమాటుకాకుండా అనేక మాట్లు చూసేను. నా కెందువల్లనోకాని ఒక్కమాటు చూసినవి మాత్రమే చటుక్కున జ్ఞాపకంవస్తాయి. అనేక మాట్లుచూసినవి అలవాటువల్ల వెనకకిపడి ప్రత్యేకంగా ఆలోచిస్తే కాని మనస్సుకి మళ్లీ చిక్కవుకాబోలు. రెండవకారణం నేను ప్యారిస్ నగరాన్నే కాకుండా అనేక గొప్ప పాశ్చాత్య నగరాలు చూసేను. బర్లిన్, వీన్, రోమ్, నపోలీ, మ్యూన్‌చెన్, ఫిరెన్‌జె, బుడా పెస్థ్, జినీవా, లుసర్న్, లెనిన్‌గ్రాడ్, మాస్కో ఇంకా ఎన్నో నగరాలూ, అక్కడా అక్కడా చూడ వలసినవిచిత్రాలూ అన్నీ చూసేను. అందువల్ల ప్యారిస్ విశేషాలేవీ అంతప్రత్యేకంగా వాటంతటవి జ్ఞాపకం రావు. ఈరెండుకారణాలేకాక మరొకకారణం, వీటి రెండిటికంటే ముఖ్యమైనది, రెనీ.

నేనిప్పుడు చెప్పదలచుకున్నకథ చెప్తే ఈదేశంలో అందరూ ఆశ్చర్యపడతారు. చాలామంది నమ్మరు. కొందరు పాశ్చాత్యసంఘాలలోఉండే విపరీతమైన దోషాలన్నీ ఈవిధంగా మనదేశంలో అందరికీ సాటిస్తున్నాననీ, అలా సాటించడంవల్ల మనసంఘాన్ని పాడుచేసిన వాడి నవుతాననీ నన్ను తిట్టడం ప్రారంభిస్తారు. కాని నా ఉద్దేశ్యం ఒకసంఘాన్ని తిట్టాలనీకాదు, మరొక సంఘాన్ని పాడుచెయ్యాలనీ కాదు. నా అభిప్రాయం ఏమిటంటే, నిజంచెప్పడంవల్ల ఎవరికీ అపరాధంజరగదని. అదేకాక కళ్లుమూసుకునీ, కాళ్లూచేతులూ బంధించేసుకునీ సంపాదించే పుణ్యలోకం ఏమాత్రం విలువైనదని?

ఇంక నాకథ చెప్తాను —నే ననబోయిన దేమిటంటే, ప్యారిస్‌నగరాన్ని నేనెప్పుడు తలచుకున్నా రెనీఒక్కత్తే నాకు జ్ఞాపకంవస్తుందని. రెనీ ఒక ఫ్రెంచి పిల్ల. ప్యారిస్‌లోనే పుట్టి ప్యారిస్‌లోనే పెరిగింది. పూర్తిపేరు రెనీబర్నే. అంతమరీ అందమైనదని నేను చెప్పను. ఇంగ్లండులో కనబడే అందమైనముఖాలూ, అందమైన శరీరాలూ మరేదేశంలోనూ నాకు కనబడ లేదు. ఈవిషయంలో ప్యారిస్ నాకసలేనచ్చలేదు. ప్యారిస్‌లో ముఖాలన్నీ అనేకరాత్రుళ్లబట్టి నిద్రలేని వాళ్ల ముఖాలలా ఉంటాయి. అదేకాక 'లాటిన్' ప్రజ కనుక వాళ్లయవ్వనపు కళలూ శోభా త్వరలో మాయమైపోతా యనుకుంటాను కూడాను. అదెలా ఉన్నా, రెనీ అంతఅందమైనదని చెప్పేందుకు వీలు లేదు. కాని మంచితెలివైనది. తెలివైనదని ఆకళ్లల్లోనే కనిపిస్తుంది. నవ్వుతున్నప్పుడు ఆంత అందమైనది కాదన్నమాటకూడా మరచిపోతాం.

ఈ అమ్మాయిని తలవనితలంపుగా కలుసుకున్నాను. జరిగిన దిదీ. అది నాల్గవసారి ప్యారిస్‌కి నేను

రావడం. ఒకచిన్న తోలుపెట్టె చేతిలోపట్టుకుని నేను క్రిందటిసారి దిగిన హోటల్ కే వెళ్లేను. ఈహోటల్ యజమాని నాకు చాలా నచ్చినవాడు. మొదటిసంగతి ఇంగ్లీష్ బాగావచ్చును అదికాక నాతో సరదాగా మాట్లాడుతూ ఉండేవాడు. వీలైనప్పుడల్లా నేను ఒంటరిగా భోజనంచెయ్యడంకాని, టీతాగడంకాని జరుగకుండా తనతోటే, తనకుటుంబంతోటే కలసి కూర్చునేటట్టు చూసేవాడు. అతనిభార్యా, ఇద్దరు చిన్నకొడుకులూకూడా నేనంటే సరదాగానే ఉండేవారు. క్రిందటిసారి ఒకసాయింత్రం ఆ ఇద్దరుకొడుకులనీ నేను సినీమాకి తీసుకువెళ్తానంటే తల్లి సరేనని ఒప్పుకుని పెంకితనానికి తననికూడా రమ్మని పిలవనందుకు కోపం తెచ్చుకొన్నట్లు నటించింది. ఇలా వీళ్లందరినీ కూడా బాగా ఎరుగున్నాను కనుక అక్కడికే వెళ్లేను. ఈసారి హోటల్ అంతా క్రిక్కిరిసే ఉన్నప్పటికీ నాకొక మంచిగది ఏర్పాటుచేసే డాయజమాని. పదినిముషాలు దాటేక వస్తే నాకక్కడ చోటుండకపోవునన్నాడు. యథాప్రకారంగానే నాకు సదుపాయాలన్నీ చేసిపెట్టేడు.

వచ్చిన మూడవరోజున ప్రొద్దుటేనుంచి సాయింత్రంవరకూ గదిలోనే కూర్చోడంనచ్చక రోజంతా వేరే ఎక్కడో గడుపుదామని నిశ్చయించుకుని, పదకొండు గంటలకే పైకివెళ్తూ, ఆరాత్రి పదిగంటలవరకూ గదికి రానని హోటల్ యజమానితో చెప్పి వెళ్లిపోయాను. వెళ్లిపోతుంటే అతనిభార్యకూడా నవ్వుతూ ఈరోజల్లా నీతో కాలక్షేపంచేసే అదృష్టవంతురాలి పేరేమిటో చెప్పమంది. 'మనిషినెవరినో ముందు స్థిరపరచుకున్నాక పేరు కనుక్కుందాం' అని జవాబుచెప్పేను. ...ముందు లూవ్రేచిత్రశాలకి వెళ్లేను. చూసినచిత్రకళే, చూసిన శిల్పకళే మళ్లీచూసేను. జగత్ప్రఖ్యాతిపొందిన లినార్డోడావించీ యొక్క 'మోనలిస్' చిత్రపఠాన్నీ, అనేకశతాబ్దాలక్రిందట మైలో అనువాడు అతిసుందరంగా చెక్కిన వీనస్ శిల్పాన్నీ మళ్లీచూసేను. పూర్వం అంతరమ్యమైనవిగా కనబడని చిత్రపఠాలు కొన్ని ఇప్పుడు చాలా ఆనందం కలుగజేసేయి. హెన్నర్ అను చిత్రకారుడిది 'చదువరి' అని ఒకపఠం ఉందక్కడ. ఎంతో మనోహరంగా ఉంది. క్రిందటిమాటు దానిని నేను చూడనేలేదు. జుట్టు విరబోసుకుని, దుస్తులేమాత్రంకూడా లేకుండా, నేలమీదపడుకుని, తలకుడిచేతిమీద ఆన్చి పుస్తకం చదువుతోంది ఒకావిడ. ఆవిడధ్యానం అంతా ఆపుస్తకంమీదనే. ఆచిత్రపఠాన్ని చూసిన వాళ్లకికూడా ఆపుస్తకం ఎదురుగుండా ఉండడం ఆవిడ చదువులో మునిగియుండడం మిగిలిన మనోవికారాలకి ఏమాత్రం చోటీయ్యవు. దిగంబరస్త్రీల చిత్రపఠాలనేకం చూసేనుకాని ఇంతనిర్మలమైన కళ వాటిలో నేనెన్నడూ చూడలేదు...... ...

సాయింత్రం మూడుగంటలవరకూ లూవ్రేచిత్రశాలలోనే తిరిగేను. తర్వాత ఏమిటిచేసేందుకూ తోచలేదు. కొంతసేపు ట్యూలరీస్ వనంలో అర్థంలేకుండా తిరిగేను. సినీమాకి వెళ్లడానికి బుద్ధిపుట్టలేదు. చెయ్యగలిగినది మరేమీ కనబడలేదు. ఆఖరాఖరకి లండన్ వదలి ఈసారి ప్యారిస్ నేనెందుకు వచ్చినట్టని నాలో నేను విచారించడం మొదలెట్టేను. మొన్నాడు పొద్దున్నే బయలుదేరి లండన్ కి పోవాలని నిశ్చయించుకున్నాను... నాలుగుగంటలయింది. ఆవనంలో ఒకబల్లమీద వెళ్లి కూర్చునేసరికి పక్కని ఇద్దరు ముసలివాళ్లు నేను ఆఫ్రికాదేశస్థుడనా ఇండియాదేశస్థుడనా అని వాదించుకోడం మొదలెట్టేరు. నేను ఫ్రెంచిభాష బాగా మాట్లాడలేకపోయినా చాల్లావరకు బోధపరచుకోగలను. వారిలో ఒకడు నన్ను 'ఫ్రెంచి మాట్లాడగలవా?' అని ప్రశ్నించాడు. నాకు ఫ్రెంచిభాషరాదని సంజ్ఞలు చేసెను. ఒకప్రశ్నకిమట్టుకు 'నాదేశం ఇండియా' అని జవాబు చెప్పగలిగేను. అప్పుడు వాళ్లల్లో ఒకడు, "చూసేవా? నే నన్నట్టే. ఈమనిషి పెదిమలు నీగ్రోల పెదిమలలాగ ముందుకు పొడుచుకు రావడం లేదు. చూడు" అన్నాడు. రెండవవాడు ముందుకు వంగి నాకేసి చూడబోతుంటే ఇదెక్కడిబాధని చెప్పి లేచి వెళ్లిపోయాను.

తిన్నగా హోటల్ కే వెళ్లిపోయాను. పదిగంటలదాకా రానన్నవాడిని అయిదుకొట్టకుండానే వచ్చే

నేను. లోపల కాలుపెట్టగానే యజమాని నాకేసి దెయ్యాన్ని చూస్తున్నవాడిలా హడిలిపోతూ చూసేడు. ఏమీ తోచకపోవడంవల్ల ముందుగానే వచ్చేనని నవ్వుతూ సమాధానం చెప్పేను. ఇంతట్లో అతనిభార్య వచ్చింది. తనుగూడా నాకేసి ఏమిటో అతికంగారుగా చూడడం మొదలెట్టింది. 'మీరు పదిగంటలవరకూ రారనుకుంటున్నాం' అంది. తనకికూడా బోధపరి చారు నా చిక్కులు. నాగదికి పోదాం అని మెల్లెక్క బోతుంటే హడావిడిగా నావెంటవచ్చి ఆయజమాని ఈ రోజుకి వాళ్లతో క్రిందనే టీ పుచ్చుకోమని బ్రతిమాలు కున్నాడు. సరేకాని, ముఖంకడుక్కునేందుకు గదికి వెళ్లాలన్నాను. యజమాని భార్య ఎంతో ఆప్యాయంగా క్రిందనే కొత్తసబ్బుబిళ్లా, తువ్వాలూ ఇస్తానంది. ఇదంతా నాకేమీ బోధపడలేదు. ఆఖరికి వాళ్లిద్దరికేసీ చూసి చూసి ఈగందరగోళం అంతా ఏమిటో తిన్నగా బోధపర చమన్నాను. 'చాలా బుద్ధిపొరపాటయింది; క్షమించాలి' అంటూ మొదలెట్టేడాహోటల్ యజమాని. 'మరేమీ పరవాలేదు, చెప్పండ' న్నాను. అప్పుడు చెప్పేరు.

నేను వెళ్లిపోయాక రమారమి ఒంటిగంటన్నరకి ఒక అమ్మాయితో ఫ్రెంచికుర్రాడొకడొచ్చి సాయంత్రం అయిదుగంటలవరకూ ఒకగది కావాలన్నాడట. యజమాని ముందర గదులేవీ ఖాళీగాలేవని జవాబిచ్చాడట. కాని ఆకుర్రాడు దుఃఖంగా ఇటూ అటూ చూస్తూ నుంచునేసరికి జాలికలిగి నాగదిమాటా, నేను పదిగంటల వరకూ రాననడం జ్ఞాపకం వచ్చాయట. వచ్చినవాళ్లిద్దరూ భార్యాభర్తలు కారని తెలుసును. అయితే నేమీ? యవ్వనంలో ఎవరైనా ఇటువంటి అడ్డులవల్ల దుఃఖపడడం ఫ్రెంచివాళ్లెవరూ చూస్తూ భరించలేరట. అందువల్ల యజమాని అయిదుగంటలకి సరిగ్గా వెళ్లి పోయేటట్టయితే నాగది వాడుకోవచ్చునని ఒప్పుకున్నాడట. నాఅనుమతిలేనిదే అలా ఒప్పుకోడం చాలా తప్పనీ, క్షమించమనీ వెయ్యిసార్లు బ్రతిమాలుకున్నాడు. ఇందులో క్షమించకుండా ఉండేందుకు ఏమీ లేదనీ, తను చేసినదల్లా నా ఒప్పుదలతో నన్నమాటేననీ బదులు చెప్పేను.

నే నీకథచెప్పడం మనదేశంలో కనక ఈ సందర్భంలో కొన్నివిషయాలు చెప్పవలసిన అవసరం ఉంది. పెళ్లికాని అబ్బాయిలూ, అమ్మాయిలూ యావన్మందీ ప్రతిపాశ్చాత్యదేశంలోనూ విచ్చలవిడిగా స్వేచ్ఛావిహారం చేస్తారని కాదు కాని, వీలైనంతవరకు ఆస్వేచ్ఛ అనుభవించాలన్న కోరిక రెండువైపులా ఉండడం అక్కడ సామాన్యమే. తర్వాత ప్రతినగరంయొక్క ప్రతిహోటల్ లోనూ కూడా అటువంటివారికి సదుపాయాలు సిద్ధంగా ఉంటాయనికాదు కాని, ప్రతినగరంలోనూ అటువంటి సదుపాయాలు సమకూర్చేహోటల్ కాస్త వెతికితే కనబడకమానదు. లోకంలో ఇటువంటి పనులు జరుగుతూఉండడం సిగ్గుపడవలసిన విషయమే. అయినా ఆదేశాలలో ఈవిధమైన పనులు జరగకుండా చేసే మహానుభావుడెవడూ ఇంకా ఉద్భవించలేదు...

ముఖం కడుక్కొకుండానే టీతాగడానికి సిద్ధపడ్డాను. మేమూ టీతాగడానికి వెళ్లబోతుంటే ఆ అబ్బాయీ, అమ్మాయీ మెట్లుదిగేరు. ఇద్దరికీ కూడా ఇరవై ఇరవైరెండేళ్లకి పైనుండవు. హోటల్ యజమాని నాకేసి పెంకితనంగా చూస్తూ నెమ్మదిగా, 'వీరిద్దరే ఇంతసేపూ మీగదిలో ఉంట.' అన్నాడు. దగ్గరగా వచ్చాక వారితో నాకు పరిచయం కలిపేడు. కుర్రవాడిపేరు ఫిలిప్ డోప్రే అమ్మాయి పేరేమిటని తడుముకుంటుంటే రెనీబర్నే అని తనేచెప్పింది. టీ పుచ్చుకునేందుకు వాళ్లిద్దర్నీకూడా రమ్మన్నాం. కాసేపు వాళ్లల్లోవాళ్లాలోచించుకుని ఆఖరికి 'సరే' నన్నారు. టీ తాగడానికి కూర్చుంటుంటే రెనీ చేతిలో రెండుపుస్తకాలుచూసేను. అవి ఏమిటని నేనడిగితే చూడమని నాకందిచ్చింది. ఒకటి షేక్స్పియర్ నాటకాలు. రెండవది జర్మన్కవి గొయ్టేవ్రాసిన ఫౌస్ట్. నేనంతవరకూ వీరిరువురికీ కూడా ఫ్రెంచితప్ప మరే భాషా రాదనుకున్నాను. ఇప్పుడడిగితే ఫిలిప్కి ఫ్రెంచొక్కటే వచ్చును కాని రెనీకి ఫ్రెంచేకాకుండా ఇంగ్లీషూ, జర్మన్కూడా వచ్చునని తేలింది. షేక్స్పియర్ నాటకాలన్నీ చదివేనంది. ఇంగ్లీషుకవులంటే చాలాసరదాఅంది. జర్మన్ భాషలోకూడా చాలా

పుస్తకాలు చదివేనంది. కవులందరిలోనూ షిల్లర్ తనకి ప్రత్యేకంగా నచ్చినవాడంది. 'గొప్పచదువరి వన్న మాట!' అన్నాను. 'చదువరి' అన్నమాట పైనపడ గానే ల్యూవ్రేలోచూసిన చిత్రపటం జ్ఞాపకంవచ్చింది. వెంటనే ఆవిషయమైచెప్పి, 'ఎన్నడైనా ఆచిత్రపటం చూసేవా?' అనడిగేను రెనీని.

"హెన్నర్ అన్నచిత్రకారుడు వ్రాసినదేనా?"

"అవును."

"చూసేను. అసలు నాకు చాలానచ్చిందది. దానిప్రతికూడా నాదగ్గరుంది. కాని చిత్రకళాపండితు లెవరూ అదంత గొప్పదని ఒప్పుకోరు."

"నిజంగా?"

"అవును. ఎవరూ దానినంతగా మెచ్చుకోలేదు. నాకుమట్టుకు అఖండంగా నచ్చిందది...ఎవరో కవికి కలలో కనబడిన విచిత్రదృశ్యంలా ఉంటుందికాని కామోద్రేకం కలుగజేసే సామాన్యమానవశరీరంలో కన బడనే కనబడదది. దానిలో చిత్రకళకంటె కవిత్వ ధోరణి హెచ్చుంది... ఇదే మొదటిసారి నాకు దాని నంతగా మెచ్చుకునేవారు మరొకరు కనబడడం."

ఈపటంగురించి జరిగినసంభాషణలో తేలిన విష యా లేమిటంటే —ఫిలిప్ ల్యూవ్రేచిత్రశాల చూసి ఆరే ళ్లయిందనీ, ఆరేళ్ల క్రితం చూసినది తనకేమీ జ్ఞాపకం లేదనీ, మాహోటల్ యజమాని నిజంచెప్పడానికి సిగ్గు పడకపోతే ల్యూవ్రేచిత్రశాల ఎన్నడూ చూడనే లేదనీ, అతనిభార్యకి ల్యూవ్రే అంటే ఏమిటో తెలుసునో తెలి యదో కూడా సందేహాస్పదమనీ!

టీతాగడం అయాక వాళ్లిద్దరూ వెళ్లేందుకు లేచేరు. వెళ్లబోతూ ఫిలిప్ యజమానిని పక్కకిపిలచి ఆగదికి కొంతడబ్బివ్వబోయాడు. అప్పుడతను నాకేసి చూపిస్తూ గదినాదనీ, తనకేమీ డబ్బు పుచ్చుకునేందుకు హక్కు లేదనీ బోధపరచాడు. నేనుకూడా యజమాని వానినిగురించి నాతో చెప్పేడనీ, డబ్బేమీ ఇచ్చేందుకు వీలు లేదనీ అన్నాను. అప్పటివరకూ వాళ్లిద్దరూ గ్రహించ లేదు హోటల్ మనిషి వాళ్ల సంగతంతా నాకు చెప్పేసే డని. . రెనీకి అమితమైన సిగ్గూ, అమితమైన కోపంకూడా సంభవించాయి. మాయజమాని మట్టుకు 'ఈమాత్రం దానిలో తప్పేమి' టని వాదించాడు. 'ఆగది మరొకరి దనిచెప్తే మే మిక్కడ ఉండకనే పోదుం' అన్నాడు ఫిలిప్. 'నీతో నేనిక్కడకి రావడమే బుద్ధిపొరపా' టంది రెనీ ఫిలిప్‌తో. ఫిలిప్ ఉద్రేకం మరీ హెచ్చ యింది. మా యజమానికేసి చూస్తూ, 'మాసంగతి ఊళ్లో వాళ్లందరికీ చెప్పేందుకు నువ్వెవడవు?' అన్నాడు. యజమాని 'ఈబాధంతా ఎందుకు తెచ్చిపెట్టుకున్నా నురా!' అని తల తడుముకుంటూ మరొకవైపుచూస్తూ నుంచున్నాడు. నేను తనపక్షాన్నీ, నాపక్షాన్నీకూడా క్షమార్పణకోరేను. కొంతసేపటివరకూ ఇద్దరూ మాట్లాడ లేదు. నేనింకా దీనంగా మాట్లాడుతుంటే ఇంతవరకూ నాకేసి చూడకుండా నుంచున్న రెనీ 'మీతప్పేమీ లేదు. అంతా ఆయజమానిదే. మీరెందుకు క్షమించ మనడం?' అంది. 'ఇద్దరిదీతప్పే. ఇద్దరిదీ కాదు. ఇంతకీ జరిగిన హానేమీ లేదుకదా' అన్నాను. 'మిమ్మ ల్నేమీ అనడంలేదు సుమండీ' అందిమళ్లీ. 'ఈ హోటల్ కిక నేనెన్నడూ రా' నన్నాడు ఫిలిప్. నేనెన్నడూ రానంది రెనీ అతినిశ్చయంగా. వాళ్లీమాటల యాక గుమ్మందాటి వీథిలోవెళ్తుంటే వాళ్లవెంట నేనూ వెళ్లేను. నేనింతసేపూ ఇంగ్లీషులో మాట్లాడుతూ ఉండడంబట్టి ఫిలిప్ నే నన్నదేమీ బోధపరచుకోలేక పోతున్నాడు. అయినా నేను నాతప్పుడు ఫ్రెంచిభాష ప్రయోగించకుండా ఇంకా ఇంగ్లీషులోనే మాట్లాడేను. 'మళ్లీ మిమ్మలి నెప్పుడు నేనుచూడడం?' అనడిగేను. ఫిలిప్ ఏమిటంటే రెనీ నాప్రశ్న ఫ్రెంచిలో బోధపర చింది. 'ఈహోటల్‌కి మళ్లీ మేము ఎన్నడూ రా దలమకోలేదే' అన్నాడు ఫిలిప్. ఆమాట నేను బోధ పరచుకున్నాకూడా రెనీ భాషాంతరీకరణంచేసిచెప్పింది. 'ఇక్కడకాదు. మనం మరెక్కడైనా మళ్లీ కలుసు కుందాం' అన్నాను. వాళ్లు నాకు జవాబిచ్చేందుకు సందేహిస్తుంటే రెనీతో, 'నేనూ నీలాగే ఇంగ్లీషు లోనూ జర్మన్‌లోనూ చాలాపుస్తకాలు చదివిన వాడిని. మనిద్దరం కలసి మాట్లాడగలిగిన విషయాలు చాలా

ఉంటాయి. నాకు కూడా ఇంగ్లీషుకవులంటే ప్రాణం ... రేపు మీరిద్దరూ వస్తే ఎక్కడైనా టీపుచ్చుకుని తర్వాత సినీమాకి వెళ్దాం' అన్నాను. రెనీ 'సరే' నంది. ఫిలిప్‌కి బోధపరచింది. ఫిలిప్‌కూడా నాకేసి తీక్షణంగా చూస్తూ సరేనని తలఊపేడు. మొన్నాడు ఎక్కడ కలసుకునేదీ స్థిరపరచుకొని వాళ్లతోవని వాళ్లూ, నా తోవని నేనూ వెళ్తూ విడిపోయాం...... హోటల్‌లో మళ్లీ ఫిలిప్‌గురించీ, రెనీగురించీ మాట్లాడేం. యజమానీ, అతని భార్యాకూడా ఫిలిప్ చాలామంచివాడిలా కని పిస్తాడనీ, రెనీ చాలా గయ్యాళిలా కనిపిస్తుందనీ అన్నారు. వాళ్లతో వాదించడం ఇష్టంలేక 'అవున'న్నాను.

మొన్నాడు రెనీ ఫిలిప్ నేనూ కలసుకున్నప్పుడు ముందటిరోజువిషయాలేమీ మాట్లాడలేదు. రెనీ ఎంతో నవ్వుతాలుగా మాట్లాడడం మొదలెట్టింది నాతో. ఫిలిప్‌కూడా కొంతటీతాగేక సరదాగా కబుర్లుచెప్పేడు. వీళ్లు చిన్నప్పటినుంచీ ఒకరినొకరు ఎరుగుదురట. ఫిలి ప్‌కి రెనీఅంటే అనేకసంవత్సరాలబట్టి గొప్పప్రేమ. ఫిలిప్ తండ్రి వర్తకుడు. అంత మరీ ధనవంతుడుకాడు కాని ధనవంతుడే. రెనీ తండ్రి బీదవాడు. రెనీకి కొంత చదువు చెప్పించాడుకాని, ప్యారిస్ విశ్వవిద్యాలయంలో ప్రవేశించడానికి డబ్బులేక మానేసింది. ఉద్యోగానికి ప్రయత్నంచేస్తోం దిప్పుడు. చదువంటే చాలాఅభిలాష. తంటాలుపడి ఇంగ్లీషుభాషా, జర్మన్‌భాషాకూడా నేర్చు కుంది. ఫిలిప్‌తండ్రికి రెనీసంగతి తెలుసును. పేదకుటుం బంలో పుట్టినదని రెనీతో తిరుగవద్దని ఫిలిప్‌ని ఆజ్ఞా పించాడు. ఫిలిప్ సరేనని ఒప్పుకుని దొంగతనంగా ఇలా రెనీతో కాలం గడుపుతున్నాడు. తనచేతిలోఉంటే రెనీని వెంటనే పెళ్లిచేసుకునేందుకు సంసిద్ధుడై యు న్నాడు. కాని ఇవి వచ్చేఆస్తులు వదులుకోవలసిన రోజులుకావు. వాళ్లబాధలకంతా ఇదే మూలకారణం. ...'ఇక నీసంగతో?' అన్నారు. చెప్పవలసిన దేదో చెప్పేను. కాసేపయాక మాటలసందర్భంలో 'ఈసారి ప్యారిస్‌లో ఏమిటోకాని నాకేమీ తోచడం లే'ద న్నాను. రెనీ నాకేసి నవ్వుతూ 'ప్యారిస్‌నగరంలో అంతతోచకపోవడం, అంత ఒంటరిగా ఉండడం ఎందు వల్లను?' అంది. 'నాకు ఫ్రెంచి బాగారాదు సరిగదా, నేనంత సులభంగా మనుష్యులతో స్నేహంకూడా చెయ్యలే'నన్నాను. 'ఇక్కడ కన్నుగీటితే కోటి కాంతలే!' అంది. కన్నుగీటడంలో నాకంత అభ్యాసం లేదనీ, అయినా కన్నుగీటుకి వెంటబడే కాంతలంటే నాకంత అభిప్రాయంలేదనీ చెప్పేను. 'నువ్వు మేధా వంతుడవని కనిపెట్టి ప్యారిస్‌లో స్త్రీలందరూ నిన్ను ప్రేమించాలని కాబోలు నీ ఉద్దేశ్యం' అంది రెనీ వెంకి తనంగా. 'అంత తలతిరుగుడివాడిలా కనిపిస్తున్నానా?' అనడిగేను.

పత్రికలో ప్రకటనలుచూసి వెళ్లేసినీమా ఏదో నిశ్చయించుకున్నాం. టిక్కట్లుకొని లోపలకూర్చో బోతుంటే ఫిలిప్ రెనీకీ నాకూ మధ్యని కూర్చో బోయాడు. పాశ్చాత్యదేశాలలో ఇద్దరుపురుషులతో ఒకస్త్రీవస్తే ఆస్త్రీ ఇద్దరిపురుషులమధ్యనీ కూర్చోవాలి. లేకపోతే అందులో ఒకరిని అమర్యాదచేసినట్టు. రెనీ వెంటనే ఫిలిప్‌ని పక్కకివెళ్లమని తను మధ్యని కూర్చుంది. ఇద్దరూ కొంచెం వాదించుకున్నారు. నేనేమీ చూడ నట్టూ, విననట్టూ నటించాను. కాని జరిగినదేమిటంటే ఆ నిముషంనుంచి ఫిలిప్ నాతో సరదాగా మాట్లాడడం మానేసేడు. దానికి బదులు రెనీ నాతో మరీచనువుగా మాట్లాడడం మొదలెట్టింది. మేమిద్దరం అంతసేపూ ఇంగ్లీషులో మాట్లాడుతూఉండడం ఫిలిప్‌కి నచ్చడం లేదు. నిముషనిముషానికీ రెనీని మాట్లాడేదేమిటని అడు గుతూవచ్చాడు. కొన్నిసార్లు సావధానంగా జవాబు లిచ్చింది. ఆఖరాఖరికి తనకి విసుగుపుట్టింది. చివరకి నాకేసి తిరిగి, 'మనం ఇంగ్లీషులో ఏమేమి రహస్యాలు చెప్పేసుకుంటున్నామో అని అనుమానపడిపోతున్నాడు ఫిలిప్' అంది. ఆ మాట అనేసరికి నాకు సిగ్గేసింది. తనస్నేహితుడిని ఈమాత్రానికే ఇరవైనాలుగుగంటలు మాత్రమే ఎరుగున్న నాదగ్గర అంతచులకనచేసేస్తోం దని కొంతకోపంగూడా వచ్చింది. నాఆశ్చర్యం అం తతో నిలిచిపోలేదు. రెనీ సంవత్సరాలకొలదీ ఎరుగున్న స్నేహితుడితోలాగ ఫిలిప్‌గురించి నాతో మాట్లాడడం మొదలెట్టింది. కవిత్వం అన్నా, కళలన్నా ఫిలిప్‌కి

ఏమీ బోధపడదంది. ఫిలిప్‌కి రెండే ముఖ్యమట-డబ్బూ, రెనీ. తను మరొకరితో, ఆడవాళ్ళ యేది మొగవాళ్ళ యేది, స్నేహంగా ఉండడం ఫిలిప్ సహించలేడట. చాలా మంచివాడే కాని ఇలాంటిగుణాలు చూస్తే అప్పుడప్పుడు చికాకుగా ఉంటుందంది. నాకా మాటలు వింటుంటే నేనీ ఇద్దరితో సహవాసం కలుపుకోడం చాలా తెలివి తక్కువ అనిపించింది. 'అంత నచ్చనివాడయితే, ఫిలిప్‌కి తను స్త్రీ పురుషుడి కివ్వగలిగినంత చనువూ ఇచ్చేసిందే, ఎలా ఇవ్వగలిగిందా?' అని బోధపరచుకునేందుకు ప్రయత్నంచేసేను. తర్వాత, ఈవిషయాలన్నీ అటుపక్క ఫిలిప్‌ని పెట్టుకుని నాతో ఎందుకు చర్చించాలి? ఆగలేక అడిగేసేను.

"నిన్ననే మొదటిసారిచూసిన నాతో ఈసంగతులన్నీ ఇంతవివరంగా చెప్పడంలో న్యాయం ఏమిటి?"

నే నాప్రశ్న వేసేసరికి నావైపు అతిదీనంగా చూసింది రెనీ.

"నిన్ను చూసినప్పటినుంచీ నువ్వు నన్ను సరిగ్గా బోధపరచుకోగలవని పొరపాటున ఆశపడ్డాను." అంది.

"ఎవరైనాసరే ఒక్కరోజులో ఎవరినైనా బోధపరచుకోగలరా?"

"నీకూ నాకూ ఇష్టాయిష్టాలన్నీ చాలావరకు సమానం అని తోచింది. మరొకమాట. ప్యారిస్‌కివచ్చి వీథిలో వారకాంతల వెంటబడని విదేశీయులంటే ఎవరికైనా గౌరవమే."

"నేనెన్నడూ వారివెంట బడలేదని నీ కేమిటీ ధైర్యం?"

"నాకు తెలుసును...అదికాక ఆంగ్లేయ కవుల గురించీ, జర్మన్ గ్రంథకర్తల గురించీ నాతో మాట్లాడగలిగినవాడవు ఇన్నాళ్లకి నువ్వొకడవు కనిపించావు... నేను ప్యారిస్‌లో గొప్పవాళ్లనికాని, చదువుకున్నవాళ్లని కాని ఎవరినీ ఎరగను......ఇవన్నీ అటుండగా, నా లూవ్రేచిత్రపటాన్ని నువ్వుకూడా పొగడడం సామాన్యమైన వింత కాదు. ఇప్పుడుకూడా, నిజంగా, ఫిలిప్ కంటె నువ్వే నన్ను బాగా బోధపరచుకోగలవని నా నమ్మకం."

రెనీ చెప్పేది యాకత్తూ నిజమని నేనప్పుడు గ్రహించాను. నిజం కనుక నే తనతో పరిచయం వృద్ధిపరచుకునేందుకు నాకూ ముందటిరోజున కోరిక కలిగింది. కాని ఇది చాలా హానికరమైన స్థితి అని కనిపెట్టేను. మరొకవారంరోజులు రెనీకీ ఫిలిప్‌కీ మధ్యని నే నున్నా నంటే వాళ్లిద్దరూ పోట్లాడి విడిపోతారని నాకు తెలుసును. ఈసాయంత్రం గడచినతర్వాత రెనీని నే నెన్నడూ కలసుకోకూడదని గట్టిగా నిశ్చయించుకున్నాను. మనుష్యమాత్రులమే కనుక ఆలోచించుకోకుండా ఎంతమందిజీవితాలు నిరర్థకం చేస్తామో మనకే తెలియదు. ఈవిషయంలోమట్టుకు నేను కళ్లు మూసుకుని గోతిలో పడకూడదనుకున్నాను.

సినీమాలోంచి ముగ్గురం వచ్చేసేం పైకి. నాకోరిక నెరవేర్చి నాతో సినీమాకి వచ్చినందుకు వాళ్లిద్దరికీ నా వందనా లర్పించాను. అదయాక చటుక్కున 'నాకు వేరేపనుంది. నేను పోవా'లన్నాను. రెనీ నాకేసి ఆశ్చర్యంగా చూస్తూనుంచుంది. ఫిలిప్ "మళ్లీ ఎప్పుడు నిన్ను చూడడం?" అన్నాడు. ఈలోకంలో ఇలాగే అన్నీ అనుకోనట్టు జరుగుతాయి. మాట్లాడకుండా ఇద్దరూ వెళ్లిపోతా రనుకున్నాను. ముందుగా మాట్లాడినది ఫిలిప్!

"నేను రేపే లండన్ వెళ్లిపోతున్నాను."

"అప్పుడేనా?" అంది రెనీ.

"నువ్వే మమ్మల్ని టీకీ, సినీమాకీ పిలిచావు కాని, నిన్ను మేము పిలవనక్కరలేదా?" అన్నాడు ఫిలిప్. రెనీ ఆమాటే నాకు ఇంగ్లీషులో చెప్పింది.

"ఈవిషయంలో అంత కట్టుబాటేమిటి?... పరవాలేదు. మళ్లీ ప్యారిస్ వచ్చినప్పుడు నాకీమర్యాదలన్నీ చేద్దురు గాని."

"వీలులేదు. రేపుసాయంత్రం నాలుగుగంటలకి ప్లేస్‌డి లా మేడలైన్ దగ్గర మమ్మల్ని కలసుకోవాలి" అన్నాడు ఫిలిప్.

"కాని రేపుప్రొద్దున్న నేను వెళ్లిపోతున్నాను."

"రేపు వెళ్లేందుకు వీలులేదు" అంది రెనీ.

"సరే" అన్నాను.

మొన్నాడు నాలుగుగంటలకి అనుకున్నచోట సిద్ధం నేను. నాచేతిలో రెండు పుస్తకాలున్నాయి. మొదటిది గాంధీమహాత్ముని స్వీయచరిత్రం. రెండవది రవీంద్రుని గీతాంజలి. ప్రొద్దున్న తిరుగుతుంటే ఒక పుస్తకాలకొట్టులో ఈరెండూ కనబడ్డాయి. రెనీ కివి కొని బహుమానంగా ఇవ్వాలని బుద్ధిపుట్టింది. వెంటనే కొన్నాను. రెనీ వీటిని చూసి చాలా సంతోషిస్తుందని నాకు తెలుసును. ఫిలిప్‌తో రెనీ వచ్చేసరికి పది నిము షాల ఆలస్యం అయింది. ఆలస్యానికి క్షమించమన్నాడు ఫిలిప్. రాగానే నాచేతిలో ఉన్న పుస్తకాలు చూపెట్టి 'అవి ఏమిటి?' అనడిగింది రెనీ. 'నువ్వు చూడవలసినవి కావు' అన్నాను.

"అందుకే చూపించు."

"తర్వాత చూపిస్తాను."

ఒక 'కేఫే' లో కూర్చుని టీ తాగుతుండగా రెనీ కాపుస్తకాలు చూపించాను. నేను వాటిని తనకే కొన్నానని లోపలివ్రాత జూడగానే పరిమితిలేని ఆనందం వెల్లడిజేస్తూ, 'నువ్వింత మంచివాడవని నే ననుకోలేదంది.

ఫిలిప్ కొంచెం ఈర్ష్య దాచీదాచుకోనట్టు పెంకితనంగా, 'రెండుపుస్తకాలూ రెనీకే అయితే నా కేమిటి?' అన్నాడు.

"పుస్తకాలు రెనీవి రెనీ నీదీ." అన్నాను.

ఇద్దరూ నవ్వుకున్నారు. ఫిలిప్ ఆసరదాలో రెనీభుజంమీద తనచెయ్యి వేసేడు. ఫిలిప్‌కేసి చూడ కుండా ఆచెయ్యి తొలగించుకుని, రెనీ "సరిగ్గా నా కివ్వవలసిన పుస్తకాలే ఇచ్చావు నువ్వు......నిజంగా చెప్తున్నాను, నిన్ను సంతోషపెట్టాలనికాదు. ఎన్నేళ్లబట్టో ఇండియాదేశం చూడాలని నాకు గొప్ప ఆశ. ఈజన్మలో తీరని కోరికలలో అదొకటి." అంది.

"ఆచెల్లని కోరికలలో మిగిలినవి ఏమిటి?" అనడిగేను అల్లరికి.

రెనీ జవాబుచెప్పలేదు.

"ఏదైనా నాటకానికి కాని, సినీమాకి కాని వెళ్దామా?" అన్నాడు ఫిలిప్.

వద్దన్నాను నేను. రెనీకూడా వద్దంది. మరేమిటి చెయ్యడం అని ఆలోచిస్తే, రెనీ ఏదైనా తోటలోకి వెళ్లి కాసేపు నడచి ఎక్కడైనా కూర్చుందాం అంది. బోయ్‌దిబొలోన్ అన్నచోటికి వెళ్లేం. సరదాగా మాట్లాడుతూ చీకటిపడేవరకూ నడిచేం. ఆఖరికి నేను వెళ్లిపోవాలంటే కాసేపు అక్కడ బల్లల మీద కూర్చుని తర్వాత వెళ్లిపోదాం అంది రెనీ. చీకటిలో ఒకబల్లమీద ముగ్గురం కూర్చున్నాక రెనీ మౌనం దాల్చింది. నేనూ ఫిలిప్‌మట్టుకు మాట్లాడుకుంటున్నాం. నాతప్పుడుఫ్రెంచితోటే తంటాలు పడుతున్నాను. అప్పుడప్పుడు రెనీచేత తప్పులు దిద్దించి నామాటలు ఫిలిప్‌కి బోధపడేటట్టు చేస్తున్నాను. మొన్నాడు నేను లండన్‌కి వెళ్తున్నానన్నాను. ఫిలిప్ నన్ను లండన్‌గురించి అనేకప్రశ్నలు వేస్తున్నాడు. రెండుమూడునెలలలో తనక్కడకి వస్తానన్నాడు. 'రెనీకూడావస్తుందా?' అనడిగితే 'నాకు లండన్‌తో పనేమిటి?' అని జవాబిచ్చింది. ఇలా ఉండగా కొంచెందూరంలో 'ఫిగారో! ఫిగారో!' అని ఒకప్యారిస్‌పత్రికని అమ్ముతూ కుర్రాడు కేకలువేస్తున్నాడు. రెనీ ఫిలిప్‌ని వెళ్లి ఒక పత్రికకొని తెమ్మంది. 'వెళ్లిపోతూ తోవలో కొనవచ్చు' నన్నాడు ఫిలిప్. తర్వాత పత్రికలు మిగులుతాయో లేదో ఇప్పుడే కొనమంది. నేను వెళ్లికొంటానని లేచేసరికి, వద్దని తనే విధేయుడిలా లేచివెళ్లేడు ఫిలిప్.

అతను కొంతదూరంవెళ్లగానే నా రెండుచేతులూ గట్టిగా తనరెండుచేతులలోనూ పట్టుకుంది రెనీ.

"నువ్వు రేపువెళ్లడానికి వీలులేదు... మున్ముందికే వీలులేదు" అంది.

"ఇదేమిటి రెనీ?" అన్నాను నిర్ఘాంతపోయి.

"వీలులేదు. నువ్వులేకపోతే నేనుండలేను... నువ్వువెళ్లకు ...రేపు మధ్యాహ్నం ఒంటిగంటకి మాల్ మెయ్‌సాన్ రాజభవనందగ్గర నువ్వుండాలి. నేను వస్తానక్కడకి ...లండన్‌కి వెళ్లననీ, అక్కడకి వస్తాననీ నాకు వాగ్దానం చెయ్యి. వస్తావా?... అదుగో, ఫిలిప్ వచ్చేస్తున్నాడు. ...వాగ్దానంచెయ్యవూ ?"

నేను వాగ్దానంచెయ్యలేదు. నాదగ్గరనుంచి దూరంగా జరిగి కూర్చుంది.

ఫిలిప్ వచ్చి, 'ఇదిగో నీపత్రిక' అన్నాడు.

ఇంతమౌనంగా కూర్చున్న రెనీ మళ్లీ యథాప్రకారంగా హాయిగా "ఏమైనా ప్రత్యేకమైన విశేషాలున్నాయా, ఫిలిప్, ఈరోజుపత్రికలో?" అంది.

"నేనింకా చూడందే" అన్నాడు ఫిలిప్.

కాసేపయాక వెళ్లిపోవాలని లేచేం. మళ్లీ నేను ఫిలిప్‌తో రేపు లండన్‌కి వెళ్లిపోతున్నా నని చెప్పేను. నేనెక్కడ నివసిస్తున్నానో కూడా చెప్పేను. ఒకచిన్న పుస్తకంలో వీధివెలుతురు బట్టి నావిలాసం వ్రాసుకున్నాడు. రెండుమూడు నెలలలో నన్ను లండన్‌లో చూస్తానన్నాడు. రెనీతో కూడా వెళ్లిపోతున్నానని చెప్పేను. ప్యారిస్‌కివస్తే తనమాట మరచిపోవద్దంది. తనెక్కడుంటోందో నాకు తెలియదంటే 'తెలియకేం చేస్తుందిలే!' అని సమాధానం చెప్పింది.

ఇకను విడిపోబోతుంటే నన్ను రెనీ, "అన్నట్టు, ప్యారిస్ అంతా చూసేనంటావు. మాల్ మెయ్‌సాన్ రాజభవనం ఎప్పుడైనా చూసేవా?" అనడిగింది.

"రెండుమూడుసార్లు చూసేను."

"చూడలేదేమో అనిఅడిగేను...చాలాఅందంగా ఉంటుంది కామా?"

"అవును."

ఆరాత్రంతా ఆలోచించాను మొన్నాడు ప్రొద్దున్న లండన్‌కి బయలుదేరి వెళ్లిపోవడమా లేదా అని. మొదట వెళ్లిపోదామని నిశ్చయించుకున్నాను. నేను తప్పకుండా ఉండిపోతాననీ, మొన్నాడు ఒంటిగంటకి కలుసుకుంటాననీ రెనీ దృఢంగా నమ్ముతోందని నాకు తెలుసును. తను ఏదడిగితే అది చేసేందుకు నేను సిద్ధంగా ఉన్నా నని రెనీకి ఈధైర్యం ఎందుకుండాలని నాకు పౌరుషం కలిగింది. సాయంత్రం ఆఖరిని మళ్లీ నన్ను మాల్ మెయ్‌సాన్‌గురించి ప్రశ్నవెయ్యడం ఒట్టిపెంకితనమూ గర్వమూ కాక మరేమీ కాదని చికాకుపడ్డాను. లండన్‌కి వెళ్లిపోవాలి నేను. తప్పదు...............

మళ్లీ, ఒంటిగంటకి మొన్నాడు మాల్ మెయ్‌సాన్ ప్రాంతాలలో నాకోసం ఎంతో అపేక్షతో కాచుకుని ఉంటుందని ఆలోచిస్తే జాలివేసింది. ఫిలిప్‌తో తనకేమీ సరియైన ఆనందంలేదు. నిజమే. అంతసున్నితమైన స్వభావం కలదానిని ఫిలిప్ బోధపరచుకోలేడు. అయినా, నేనేమీ చిక్కులలో పడకూడదు. జాగ్రత్తగా కొంతసేపుమాట్లాడి వచ్చెయ్యాలి. పరవాలేదు. ఆమాత్రం నేను చూసుకోగలను —నేనిచ్చిన పుస్తకాలు చూసుకుని చిన్నపిల్లలా ఎంతసంతోషించింది! పాపం, వెళ్లి చూడకపోతే తప్పు.

మొన్నాడు లండన్‌కి నేను బయలుదేరలేదు. ఒంటిగంటదాటిన కొన్నినిముషాలలో మాల్ మెయ్‌సాన్ ప్రాంతాలకి జేరుకున్నాను. ఒక చక్కనిగవును తొడుక్కుని రెనీ నాకోసం ఎదురుచూస్తోంది. దగ్గరకి వెళ్లేను. నేనువచ్చినందుకు తనముఖంలో ఏమీ సంతోషం చూపెట్టలేదు. చూడగానే మాట్లాడనైనా లేదు. దగ్గరలో ఒకహోటల్ ఉంటే 'అక్కడకి వెళ్లికూర్చుందాం రా' అంది. ఇద్దరం ఆక్కడకి వెళ్లి కుర్చీలలో కూర్చున్నాం. నేనేమీ మాట్లాడలేదు. రెనీకేసిచూస్తూ కూర్చున్నాను. రెనీ అంతసేపూ నాకేసి చూడకుండా ఉండేందుకు ప్రయత్నం చేస్తోంది. ఆఖరికి తనే మాట్లాడింది.

"ఒంటిగంటదాటేక నువ్విక రావేమోనని బెంగపెట్టుకున్నాను."

"అవును. ఆలస్యం అయింది. కాని నాతప్పు కాదు."

"నువ్వు రాకపోతే నేనివాళ ఏమిచేద్దునో నాకే తెలియదు."

ఇంతట్లో హోటల్ వాడువచ్చి ఏమి కావాలని అడిగేడు. తినేందుకేవో కొన్ని పదార్థాలు తయారు చెయ్యమన్నాం. వాడు వెళ్లిపోయాడు.

ఇంకా రెనీ నాకేసి చూసేందుకు సిగ్గుపడుతోంది. నేనప్పుడు, "రెనీ, నువ్వు నన్నీవాళ ఎందుకు రమ్మన్నావో తెలియదుకాని, నేను రాకుండా ఉండేందుకు చాలా ప్రయత్నం చేసేను నాకిదేమీ బోధపడడం లేదు." అన్నాను.

"నువ్వలా ప్రయత్నం చేస్తావని నాకు తెలుసును. నిన్నరాత్రంతా నాకు నిద్రలేదు. నువ్వు రావేమోననే నా బెంగ. నువ్వు..." ఇకను మాట్లాడలేకపోయింది. బల్లమీద తలవాల్చేసి ఏడవడం మొదలెట్టింది.

"ఏడవకు, రెనీ. ఎందుకిలా ఏడుస్తావు? నేనన్నమాటలేమైనా నీమనస్సునొప్పిస్తే నన్ను క్షమించు."

"నీ మాటలకని కాదు."

"మరేమిటి?"

"నీకు... నేనంటే... లెఖ్ఖ లేదు."

"రెనీ, మరొకరయితే నేనీవాళ లండన్‌కి వెళ్లకుండా ఉండిపోదునా?"

"నేనంత పోరుపెట్టేను కనుక ఉండిపోయావు."

"నిజమే. మరొకరు పోరుపెట్టినా ఉండక పోదును"

కళ్లు తుడుచుకుంది. తనచెయ్యి నాచేతిమీద వేసి ఎంతో మృదువుగా నావేళ్లన్నీ తడిమింది.

"నన్నింకా బోధపరచుకోలేక పోతున్నావు" అంది.

"నిన్ను బోధపరచుకోలేక కాదు. నాకిదంతా నచ్చడంలేదు...నిన్నూ నన్నూ ఇప్పుడు ఫిలిప్ చూస్తే ఏమనుకుంటాడు?"

"ఫిలిప్ ఏమనుకున్నా నాకింక పరవాలేదు."

"అలా అనకు. ఫిలిప్‌కి నువ్వంటే ఎంతో ప్రేమ."

"నీకు లేదు."

"నాకు లేదని కాదు. నా ప్రేమ మరొకరకం. నువ్వంటే నాకు అమితమైన స్నేహభావం. ఈసారి వచ్చి నిన్నంటూ ఒకత్తెని కలుసుకున్నందుకు నాకెంత సంతోషంగా ఉందో నువ్వు ఊహించలేవు. కాని... అంతే. ఫిలిప్ ప్రేమ అలాంటిదికాదు."

"నాతో ఫిలిప్‌గురించి మాట్లాడేందుకా ఇక్కడికి వస్తే నువ్వు?"

"అందుకే."

"అయితే మళ్లీ వెళ్లిపో. ఫిలిప్ సుగుణాలన్నీ నువ్వు నాకు వర్ణించనక్కరలేదు. నీకంటె ఫిలిప్‌ని నేను బాగానే ఎరుగుదును."

"నువ్వెరగవని కాదు...అయినా, రెనీ, నీ ఉద్దేశ్యం ఏమిటి? ఎందుకింత బాధపడిపోతున్నావు నువ్వు?"

"నేనేమీ బాధపడడంలేదు."

"మరీఏడుపూ ఇదంతా ఏమిటి?"

"నిన్ను మళ్లీ చూడకుండా ఉండమంటే ఉండలేను...నువ్వేమిటి చెయ్యమంటే అదిచేస్తాను. ఏమిటి చెయ్యమంటే అది...కాని, నిన్నుమట్టుకు నేనెప్పుడూ చూస్తూవుండాలి."

"నామాతృదేశం ఇక్కడెక్కడా లేదని నీకు తెలుసునా?"

"నేనదంతా ఇప్పుడు ఆలోచించ దలచుకోలేదు."

"పోనీ, నాశరీరచ్ఛాయ చూడు. నల్లని నలుపు ...నీకూ నాకూ స్నేహం ఉండొచ్చును కాని మరే సంబంధానికీ వీలులేదు."

"నన్ను పెళ్లిచేసుకోమని బ్రతిమాలుకోడంలేదు నేను."

"రెనీ, ఫిలిప్ నిన్ను నిజంగా సుఖపెట్టగలడు. మరేవిధంగానూ నీకు సుఖంలేదు. నువ్వు మోసంచేస్తే ఫిలిప్ భరించలేడు."

"ఫిలిప్‌కోసం అనే అంత బెంగా నీకు? ...నేను కాకపోతే నావంటివారు లక్షమంది ఉన్నారు ఫిలిప్‌కి.

"ఫిలిప్‌కోసం అనికాదు బెంగ. నీకోసమే."

ఇంతట్లో హోటల్‌వాడు తినేందుకూ తాగేందుకూ అన్నీ బల్లమీద తెచ్చిపెట్టేడు.

తింటుంటేమధ్యలో రెనీ నన్నొక విచిత్రమైన ప్రశ్న అడిగింది. "నిజంచెప్పు, నేను నీకు సరిపడినంత అందంగానూ లేనా?" నాకు నవ్వొచ్చింది.

"నీ అం. దానికి లోటులేదు. నీ తెలివితేటలకి అంతకంటే లోటులేదు. ఎవరిలోనైనా అందంకంటె తెలివితేటలు నన్నెప్పుడూ ఎక్కువ సులభంగా లోబరచుకుంటాయి" అన్నాను.

తినడం అయ్యాక ఇకనేమిచెయ్యడం అన్న చర్చ వచ్చింది. "మాల్‌మెయ్‌సాన్‌భవనం వెళ్లిచూద్దాం" అన్నాను. "దరిద్రంగా ఉంటుంది. మరెక్కడికైనా వెళ్దాం" అంది రెనీ. మిగిలినచోట్లగురించి ఆలోచించడంలో ఒకరికినచ్చినది మరొకరికి నచ్చలేదు. ఆఖరికి నేను "లూవ్రే చిత్రశాలకి వెళ్దాం" అన్నాను.

"లూవ్రేకా? ......ఫిలిప్ కనబడతాడేమో."

"అయితేవద్దు."

"పరవాలేదు. లూవ్రేకే వెళ్దాం. పద." ...... తోవలోనూ, లూవ్రేలోనూ మళ్లీ రెనీ నాతో అన్ని సంగతులూ అతిసరదాగా మాట్లాడింది. మిగిలినమాటలు మాట్లాడుతూ మధ్యమధ్యని నన్నింకా ప్యారిస్‌లో ఒక వారం అయినా ఉండిపొమ్మని బతిమాలుకునేది. ఆలోచిస్తానని జవాబిస్తూ వచ్చాను. ఒకచోట అమూర్ అండ్ సైఖీ (అనగాపాశ్చాత్యరతీమన్మథుల) చిత్రంచూపించి, 'అదెంతబాగుందో చూడు' అంది. అదిచూస్తుంటే చటుక్కున నాచెయ్యిపట్టుకుని ప్యారిస్‌లో ఇంకా కొన్నిరోజులుండిపోతానని వాగ్దానం చెయ్యమంది. చుట్టూ ఎటుప్రక్క చూసినా మనుష్యులు మరెవరూ కనుమేర చూపులో లేనట్టు నాకేసి అతిప్రేమోద్రేకంగా చూస్తోందిరెనీ. నాకు సిగ్గేసింది. చెయ్యి విడిపించుకుని "మరొకమూడురోజులు తప్పకుండా ప్యారిస్‌లో ఉంటాను. ఆపైని నేను మాటివ్వలేను" అన్నాను. 'సరే' అంది. మరొకచోట "మూడురోజులూ ఉంటానన్నావుసుమా. మాట నిలబెట్టుకోవాలి మర్యాదస్థుడిలా" అంది.

"వాగ్దానంచేసేక నిలబెట్టుకోకేంచేస్తాను?" ఆవేళ నాలుగుగంటలకి తను వెళ్లిపోవాలంది. "ఫిలిప్‌ని చూడడానికా?" అంటే 'అవు'నంది. మళ్లీ కాసేపుండి, "నువ్వీవాళ ఫిలిప్‌ని వెళ్లిచూడొద్దంటే మానేస్తాను సుమా" అంది.

"తప్పకుండా వెళ్లిచూడు."

"ఎప్పుడో ఒకప్పుడు త్వరలోనే మేమిద్దరం విడిపోకమానం. కాని సంగతంతా ఫిలిప్‌కి కొంచెకొంచెంగా బోధపడాలని నా ఉద్దేశం. ఒక్కసారిగా చెప్పడం నాకిష్టంలేదు ...నువ్వు వెళ్లమంటే నే వెళ్తాను. ఏమంటావు?......నన్నికను ముట్టుకోనివ్వను ఫిలిప్‌ని."

ఆమాటలు వింటుంటే నేనేంచేస్తున్నానో నాకే బోధపడలేదు. లోలోపలినుంచి కంగారు పుట్టుకొచ్చింది. పైకి తాపీగా ఉన్నట్టు నటించాను.

ఇంతట్లో హెన్నర్‌యొక్క చదువరి అన్న చిత్రపటందగ్గరకి వచ్చాం. రెనీ నావీపు తట్టింది.

"అదుగో, చూడు"

"రెనీ, నువ్వూ నేనూ తప్ప దీనినెవరూ పొగడలేదంటావా?"

"లేదు. నిజానికి ఇది మనిద్దరిదే."

"అయితే పట్టుకుపోదామా?"

"ఇక్కడ చూసేందుకెవరూ లేకపోతే అంత పనికీ నేను సంసిద్ధురాలనే... ...ఏరాత్రైనా మనిద్దరం వచ్చి దొంగిలిద్దాం. చాలా దురాలోచనంటావా?"

"దురాలోచనా దూరాలోచనాకూడాను ...రెనీ, ఇకమీదట నువ్వు జ్ఞాపకంవచ్చినప్పుడల్లా ఈచిత్రపటంకూడా జ్ఞాపకం వస్తుందినాకు."

"ఎందువల్ల?"

"రెండురోజులక్రిందట నువ్వూ నేనూ కూడా అన్నాం, జ్ఞాపకం లేదూ? ఈచదువరిని చూస్తే మనోవికారా లేవీ పుట్టవు. చిత్రకారుడు చిత్రించిన శరీరంలో కంటె చిత్రకారుడిలో ఉన్న కవి ఉద్దేశించిన మన సౌందర్యంలో ఎక్కువ శోభ కనిపిస్తోంది."

"అదంతా బాగానే ఉందిలే. కాని నేను జ్ఞాపకంవచ్చినప్పుడల్లా ఇదెందుకు జ్ఞాపకం రావాలి?"

"ఏమో, చెప్పలేను...నిన్ను చూస్తే కూడా నాకు స్వచ్ఛమైన ఆనందమే కాని మనోవికారం లేదు కనక నేమో."

"నిజంగా? నేను నీకంత అందవికారంగా కనిపిస్తున్నానా? నీకు మనోవికారం కలుగలేదంటే అది నాలో అందవికారం అన్నమాటే."

"నువ్వా అందవికారివి?"

"నాచిన్నప్పుడు అందరూ నేను చాలా అందంగా ఉండేదాన నసేవారు."

"ఇప్పుడు నువ్వందంగా లేవనా, నువ్విప్పుడు చిన్నదానవు కావనా!...అందానికేం కాని నాలుగు గంటలయిపోతోంది."

"అప్పుడే? అవును. నేను వెళ్తాను. మళ్లీ రేపు...పన్నెండు గంటలకే ఈవాళ కలుసుకున్న చోటనే కలుసుకుందాం. ఏమి?"

"సరే."

"నన్ను మోసపుచ్చకు సుమా...పన్నెండు గంటలకి...నిజంగా నువ్వు నన్ను ప్రేమించకపోతే నా జీవితం అర్థంలేనిదై పోతుంది...అలా నవ్వకు. వేళాకోళం కాదు."

"రనీ, ఇప్పుడు వెళ్లేముందు నీవిలాసం నాకు తెలియజెయ్యి. నాది తెలుసును కామా?"

"ఇప్పుడు తొందరేమిటి? రేపుచెప్తాను...నాకు చెప్పకుండా వెళ్లిపోదాం అనుకుంటున్నావా? వద్దు సుమా...మర్యాదైన పనేనా అది?"

"ఈ అపనమ్మకాలన్నీ ఏమిటి, రెనీ? నీకు మాటిచ్చాక వెనక తియ్యను."

"సరే. రేపు పన్నెండుగంటలకి...వెళ్లనా?"

రెనీ వెళ్లిపోయింది. నేను ప్యారిస్ వీధులంటా మతిపోయినవాడిలా తిరిగితిరిగి ఎనిమిది గంటలకి హోటల్‌కి చేరుకున్నాను. ఏమీ భోజనం చెయ్యలేను. నాగదికిపోయి బట్టలుమార్చుకోకుండానే దీపం ఆర్పేసి పక్కలో పడుకుని ఈరెండుమూడు రోజులలోనూ జరిగిన చర్యలన్నిటిగురించీ దీర్ఘంగా ఆలోచించాను. ఆలోచించినకొలదీ నాప్రవర్తనా, రెనీప్రవర్తనాకూడా చాలా అసందర్భం అనిపించాయి. నేను రోజురోజుకీ ఎక్కువ తెలివితక్కువగా సంచరిస్తున్నానని తోచింది. రెండురోజులక్రిందటే నేను లండన్‌కి వెళ్లిపోవలసిందనుకున్నాను. రెనీ నన్ను చాలా ప్రేమిస్తోందన్నమాట నిశ్చయం. కాని రెనీ నాకెంతనచ్చినా, తనంటే నాకు తనకున్నటువంటి ప్రేమ లేదన్నమాట కూడా నిశ్చయం. తను ప్రేమించినట్లు నేనెలా ప్రేమించగలను? ఇంకా నాలుగురోజులుకూడా కాలేదు ఫిలిప్ తనూ కలసి, నాలుగైదుగంటలు ఈగదిలోనే ఒంటరిగా గడిపి. మళ్లీ అలా వాళ్లిద్దరూ గడిపేరని నామనస్సులో ఎంత వెతికినా ఏమీ ప్రమాణాయకూడా లేదు...ఏదో ఒకవిధంగా ఫిలిప్‌తో సంతృప్తిపొంది రెనీ సుఖంగా ఉండాలనేనా ఉద్దేశ్యం. సుఖంగామట్టుకుండాలి, పాపం.

చెప్పకుండా మొన్నాడు ప్రొద్దున్న వెళ్లిపోదాం అని నిశ్చయించుకొన్నాను. దీపం వెలిగించి గడియారంలో చూస్తే పదకొండుగంటలయింది. మూడు గంటలలా చీకట్లో కొట్టుకున్నానన్నమాట ఈవిధంగా మనస్సు దృఢపరచుకునేందుకు. తెల్లవారగానే బయలుదేరాలి కనుక బట్టలూ అవీ సద్దుకోవలసినవి కొన్ని సద్దడం మొదలెట్టేను ఇంతట్లో ఎవరో నాగదితలుపు కొట్టేరు. భోజనం ఎందుకు చెయ్యలేదని అడిగేందుకు హోటల్ యజమాని వచ్చినట్టుందనుకుని, లోపలికి రావచ్చునని గట్టిగా చెప్పేను. వెనక్కి తిరిగి చూసేసరికి తలుపుతెరచి లోపలికి వచ్చినది—రెనీ.

"ఇదేమిటి, రెనీ?"

"రేపువెళ్లిపోవాలని పెట్టె సద్దేస్తున్నావా?"

"సద్దడం కాదు. అన్నీ పైనుండిపోతే పెట్టెలో పెట్టున్నాను. కాని, నువ్వెందుకు వచ్చినట్టిప్పుడు?"

"నిజంచెప్పు. రేపువెళ్లిపోదాం అనుకుంటున్నావా లేదా?"

"వెళ్లడానికి కాదు, రెనీ... నీకువెళ్లనని మాటిచ్చాక వెళ్లిపోతానా! ...సరేలే, అర్ధరాత్రి నాగదికి రావాలని నీకెందుకు బుద్ధిపుట్టింది? ...ఏమిటీ దారుణం?"

"నిజంచెప్పనా? నువ్వేమీ అనుకోకు. సాయంత్రం నీమాటలు కొన్ని జ్ఞాపకంతెచ్చుకుంటే నువ్వు నాకు తెలియపరచకుండా వెళ్లిపోదలచుకున్నావని అనుమానం కలిగింది. మళ్లీ వెళ్లొద్దని బ్రతిమాలుకునేందుకు వచ్చాను."

"రెనీ, నీకు మతిపోయిందా?"

"అవును. మతిపోయింది."

"ఇలా అర్ధరాత్రి నాగదికి వస్తే హోటల్ యజమాని ఏమనుకుంటాడు?"

"ఏమనుకుంటే నాకేమిటి లెఖ్ఖ?"

"ఇంతవరకూ నేను చాలామర్యాదస్థుడ ననుకుంటున్నాడు."

"తను అనుకుంటున్నంతకంటె కూడా చాలా మర్యాదస్థుడవని నేను బోధపరుస్తానులే. ...ఇలా నేను నుంచోవలసినదేనా? నీపక్కమీద కూర్చుంటాను."

"వద్దు, రెనీ. మనిద్దరం కూడా ఇప్పుడే పైకి వెళ్దాం. నిన్ను మీఇంటిదాకా దిగబెట్టి నేను మళ్లీ వచ్చేస్తాను."

"నన్ను వదలుగొట్టుకుందాం అని చూస్తున్నావు. నువ్వు ఉండిపొమ్మంటే ఈరాత్రంతా నీతోటే ఉండిపోదాం అనుకుని వచ్చాను. తెలుసునా?"

"ఆమాటఎలా అనగలిగేవు, రెనీ? ఈగదిలో నే ఫిలిప్‌తో నాలుగుగంటలు స్వేచ్ఛగా నువ్వు కాలంగడిపి నాలుగురోజులుకూడా కాలేదు."

"ఆసంగతి నువ్విప్పుడు జ్ఞాపకంచెయ్యడం అంతక్రూరత్వం అదేకాని మరొకటిలేదు."

"అబద్ధం చెప్తున్నానా నేను?"

"ఫిలిప్ అంటే నాకింకా ప్రేమ మిగిలిపోయిందనుకుంటున్నావా?...ఫిలిప్‌ని నేనెన్నడూ అంతగా ప్రేమించలే దసలు ...ఈవాళ తనతో గడపిన ప్రతి నిముషం ఒకయుగంలా అనిపించింది. తనతో కూర్చున్నంతసేపూ నిన్ను గురించే ఆలోచిస్తూ ఉన్నాను."

"వెళ్దాం, రా, రెనీ."

"ఎక్కడికి?"

"మీఇంటిదాకా వస్తాను."

"అక్కడికి నువ్వువచ్చేందుకు వీలులేదు. ఏదైనా వనంలోకి వెళ్లి కూర్చుందాం."

"వద్దు, రెనీ. ఆలస్యంఅయిపోయింది. ...... అన్నట్టు నీవిలాసం చెప్పేవుకాదు... రేపు మళ్లీ అడగడం మరచిపోతానేమో నని."

"నువ్వా మరచిపోవడం? నావిలాసం చెప్పమని నువ్వడిగినప్పుడల్లా నువ్వు నాకు మళ్లీ కనబడకుండా వెళ్లిపోతావేమో నని భయం."

"అందుకు కాదు. ఇప్పుడు చెప్పితే పుస్తకంలో వ్రాసుకుంటాను"

"నేను రేపో ఎల్లుండో ఏదైనా పుస్తకంలో వ్రాసే ఇస్తానులే."

"నీఇష్టం. ఇకను వెళ్దాం. రా."

ఇద్దరం హోటల్ వదలి పైనపడ్డాం. కొంత దూరం వెళ్లేక రెనీ మళ్లీ 'ఎక్కడికైనా వెళ్లి కూర్చుందాం' అంది. ఇప్పుడు కాదని తప్పించుకున్నాను అయితే తను ఇంటికి వెళ్లిపోతానంది. స్టేషన్‌దాకా

నేను వస్తానంటే రావద్దంది. వెళ్లిపోతూకూడా "ఇంకా నన్ను నువ్వు మోసపుచ్చి నాకు తెలియపరచకుండా వెళ్లిపోతావనే నాబెంగ" అంది.

హోటల్‌కి వచ్చాక హోటల్ యజమానితో మొన్నాడుప్రొద్దున్నే లండన్‌కి వెళ్లిపోతున్నానని చెప్పేనేను. ఇవ్వవలసినడబ్బంతా ఇచ్చేసేను. రెనీ ఆరాత్రి రావడంగురించి కొంచెం సరదాగానూ, వేళాకోళంగానూ మాట్లాడబోయాడు. నేనేమీ సమాధానం చెప్పక పోయేసరికి మళ్లీ ఊరుకున్నాడు. కాసేపయాక మాటలలో తనభార్యాపిల్లలూ నిద్రపోతున్నారని చెప్పేడు. వాళ్లులేవకుండానే వెళ్లిపోతాను కనుక వాళ్లందరికీ నాక్షమార్పణ లివ్వమన్నాను.

మొన్నాడు బయలుదేరి లండన్ జేరుకున్నాను. ప్యారిస్‌నుంచి లండన్‌వరకూ ఒక్కటే ఆలోచన నాకు—రెనీ. ప్యారిస్‌లో రైలెక్కేటప్పుడు రెనీ ఆఖరినిముషాన్ని నామోసం కనిపెట్టి స్టేషన్‌కి వచ్చేస్తుందేమో అన్న కంగారుతప్ప మరేఆలోచనా లేదు. కాని లండన్ జేరుకుంటుంటే, రైలు విక్టోరియాస్టేషన్‌లోకి ప్రవేశించబోతుంటే రెనీగురించి ఆలోచిస్తూ దుఃఖం ఆపుకోలేక ఏడ్చేసేను.

ఆతర్వాత లండన్‌లోకూడా నేనాట్టేరోజులుండలేదు. అకస్మాత్తుగా నేను లండన్‌వదలి ఇంటికి వచ్చెయ్యవలసొచ్చింది. రెనీగురించి ఇప్పటివరకూ మళ్లీ ఏమాటా వినలేదునేను............

ఇది ఇండియాదేశం. ఇక్కడ స్త్రీప్రపంచంలో ఎటుపక్క చూసినా 'సిగ్గుదొంతర'లే, మేలిముసుగులే, ఘోషాలే. ఇప్పుడు నాలోకం ఇదీ. రెనీ లోకం ఇది కాదు. అప్పుడప్పుడు సంధ్యాసమయాలలో కళ్లుమూసుకని రెనీగురించి ఆలోచిస్తే రెనీముఖం ఆముఖంలో నేనెన్నడూ చూడనటువంటి రౌద్రంతో చెదిరిపోయి కనిపిస్తుంది. నన్నిప్పటికింకా రెనీ క్షమించియుండదని విచారిస్తూ ఉంటాను. కాని ఎప్పుడైనా మిట్టమధ్యాహ్నం రెనీగురించి ఆలోచిస్తే ఫిలిప్‌ని తనుపెళ్లి చేసుకునే ఉంటుందనీ, అయిదారుగురు పిల్లలకి తల్లయి నామాటే మరచిపోయి ఉంటుందనీ నాకు తోస్తుంది ...జీవించే ప్రతిజీవానికీ రెండు వ్యతిరేకమైన మనోగుణాలుంటాయి. ఒకమనోగుణానికి జీవనపరిస్థితులతో మైత్రి, రెండవగుణానికి జీవనపరిస్థితులతో వైరం. రెండూముఖ్యమే.

---

## దర్శనము

చావలి బంగారమ్మ

కూపంబులో బడి కుంగుచున్నాను
మేఘంబులో మెరపు తొంగిచూచింది
కన్నెత్తి నేనట్టె కాంచబోయేను
పల్లెత్తి పలుకకే పారిపోయింది
అంధకారములోన అణగిపోయేను

మరల వచ్చెద నంచు వురిమి చెప్పింది
ఇదె కదా ధైర్య మం చెద నింపినాను
అదనంచు హర్షాశ్రు లదె వంపినాది
అదె యూతగా గొనుచు అట్టె లేచాను
అటు చూడ గనుపించె అతని వదనంబు.

---